ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక: 13-4-1990

# మరుభూమి

భిక్షపతి వచ్చేసరికి కరణం అప్పారావు ఆరుబయట వేపచెట్టు నీడన మంచంలో పడుకుని ఉన్నాడు.

"ఏంది కరణంగారూ, ఇంకా పడుకున్నారూ? వంట్లోగాని బాగోలేదా ఏంది?" అన్నాడు భిక్షపతి అరుగు మీద చతికిలబడి.

కరణీకం, ఖరారావుడీ అయ్యాక కరణం అప్పారావుకు ఆదాయం పోయింది. పలుకు బడి పోయింది. బద్ధకం ఎక్కువైంది. నడుం నొప్పి, కాళ్ళు నమిలినట్లు ఉండటం, వళ్ళు సలపరింత, నిద్ర పట్టకపోవటం - ఇలా ఒకదాని వెంట మరోటి రోగాలు పుంజుకుని, కరణాన్ని బందీని చేశాయి.

భిక్షపతి పిలుపుకు కళ్ళు తెర్చి, 'ఈడెందుకొచ్చాడు? దొంగముండాకొడుక్కి నాతో పనిలేంది రాడే' అని అనుకుని, లేచి కూర్చుని, పెరుగుతున్న గడ్డాన్ని నివురుకుని, "ఊరక రారు మహాత్ములు" అన్నాడు నవ్వుతూనే.

భిక్షపతికి కరణం సంగతి తెలుసు. వేలు అందిస్తే, నడుమును ఉడుంలా పట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాడనీ, వచ్చిన పని చెబితే కొండెక్కి బిగదీసుకుంటాడని.

భిక్షపతి ప్రభుత్వాన్ని తిట్టాడు.

"వీళ్ళెమ్మ నాయాళ్ళకు రాజకీయం తెలియదండీ! ఎంతసేపటికీ ఉన్నవి ఊడబీకటం తప్ప. రద్దుల గవర్నమెంటండీ పంతులుగారూ! ఏదీ ఈ పని మేం చేశామని గట్టిగా చెప్పమనండి! అబ్బే, పైవాళ్ళు ఇదో పథకం అంటే, దానికి పసుపు రంగు చొక్కా తొడిగి, ఇది మాదీ అంటారు. ఛీ దీనెమ్మ ప్రభుత్వం! లాభం లేదండీ పంతులుగారూ! నిజాయితీగా బ్రతికే నాబోటి వాళ్ళకు ఈ రాజకీయాలు కుదరవండీ! అందుకే ప్రాధమిక సభ్యత్వానికి కూడా రాజీనామా ఇచ్చి, మీలాగా కృష్ణా, రామా అంటూ వుందామనుకుంటున్నా" అని ఉపోద్ఘాతం చెప్పేశాడు భిక్షపతి.

కరణం అప్పారావు 'అమ్మ భిక్షపతీ! అధికార పార్టీని తిడుతున్నావంటే ఏదో పెద్ద ప్లానులోనే వున్నావన్న మాట!' అని అనుకుని, "రాక రాక వచ్చావు! ఏంటో సంగతి" అని అడిగాడు.

భిక్షపతి నవ్వాడు. అలా నవ్వాడంటే తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడన్న మాట. ఆ సంగతి కరణం కనిపెట్టాడు.

"ఏంది కరణంగారూ! పనిలేంది మీ కాడకు రాగూడదా ఏం? శానా రోజులైంది, చూసిపోదామని వచ్చా! అంతే!" భిక్షపతి చుట్టలు తీసి, కరణంగారికోటిచ్చి "లంకాకు లెండి! కాల్చండి!" అని తనోటి అంటించుకుని, "ఏందోలే కరణంబాబూ! రోజులు బాగోలేవు! మనలాంటి పాతకాలం వాళ్ళకు, అబ్బే గడ్డురోజులొచ్చాయి!" అన్నాడు.

కరణం చుట్ట కాల్చాడు. కాలుస్తూ ఆలోచన చేశాడు - భిక్షపతికి తనతో పనేమిటో? అని.

భిక్షపతి చదివింది ఐదో తరగతే అయినా, మొదట్నుంచీ వ్యవహారాలు, డబ్బు సంపాదన - అది వీలుగాకపోతే, పలుకుబడి, పదవి వీటిపై శ్రద్ధ ఎక్కువ!

మతం పుచ్చుకుంటే కాలేజీలో, హాస్టల్లో సీటు ఉచితం అని కొడుకుల్ని మతంలో చేర్చాడు. వాళ్ళ చదువులు అయి, ఉద్యోగాలకు మతం అడ్డొస్తుందని తెలుసుకొని, అబ్బె మతానికి నీళ్ళొదిలి, హరిజన కోటాలో పిల్లలకు ఉద్యోగాలు అమర్చాడు.

కొన్నాళ్ళు స్కూలు నడిపాడు. బీద విద్యార్థులకు హాస్టల్ నడిపాడు. రాజకీయాల్లో తిరిగి, కులపోళ్ళ వోట్లేయిస్తానని పార్టీల దగ్గర డబ్బుచ్చుకుని, గెలిస్తే నా గొప్ప, ఓడితే "దొంగనాకొడుకులు! తెలివి మీరారు. డబ్బుల్దీసుకుని ఓటెయ్యకుండా తిరుగుతున్నారు" అని చెప్పకు తిరిగేవాడు.

ఇలా భిక్షపతి గతాన్ని నెమరువేసుకుంటున్న కరణం అప్పారావు ఆలోచనకు భిక్షపతి, పిలుపు అంతరాయం కలిగించింది.

"ఏంది కరణంగారూ! అమ్మాయి కాన్పు కొచ్చింది. పాలిచ్చే గేదె ఎండిపోయింది. పాలకూ, మజ్జిగకూ ప్రాణం మీది కొచ్చిందని నాకు చెప్పకనేపోతిరే!"

"చెబితే ఏం లాభమయ్యా! ఊరంతా పాలు అమ్ముకుంటున్నారు - డైరీ ఫారానికి. నేనా డబ్బిచ్చి కొనలేను. నన్నేం చావమంటావు?" అప్పారావు చుట్ట విసిరేసి, కాండ్రించి ఉమ్మాడు నిస్సహాయంగా.

భిక్షపతి నొచ్చుకున్నాడు.

"అరెరె! అరెరె! పంతులుగారూ నాకు హైదరాబాదు చుట్టూ తిరగటంతోటి తీరిక లేదండీ. ఊళ్ళో కొచ్చినా అర్థరాత్రి రావటం, కోడి కూసేసరికి మళ్ళీ తిరుగు ప్రయాణం చేయడం!"

భిక్షపతికి ఆవేశం వచ్చింది. ఇంటి గుమ్మం కాడికి వెళ్ళి -

"అమ్మగారూ! ఆ తప్పేలా ఇలా ఇవ్వండి! మాకు పాడి గేదెలు రెండున్నాయి, నాకేమో పాలమ్ముకోవటం అట్టే గిట్టదండీ. ఊరికే పెరుగు, పాలు కుక్కలకూ, నక్కలకూ పోస్తున్నాం. ఇలా ఇవ్వండి గిన్నె! క్షణంలో లగెత్తుకెళ్ళి తెస్తా!"

భిక్షపతి వెళ్ళాడు.

"ఏంటి! ఈయనగారికింత ప్రేమెచ్చింది మనమీద?" కాంతమ్మ అడిగింది

అప్పారావును.

"పనేమిటో చెప్పలా"

"దొంగసచ్చినోడ్ని బాగా పిండండి"

అప్పారావు - మాజీ కరణం నవ్వాడు. అలా కరణీకం వున్న రోజుల్లో నవ్వితే, ఏనుగంత అసామీ, నిలువునా గజగజలాడేవాడు. పంటల కాలంలో వడ్లు, జొన్నలు, కందులు, పెసలు, మిరపకాయలు, కూరలు, పాలు, పెరుగు, జున్ను - ఒకటేమిటి ఊరి కంఠంలో పండింది మొదట కరణంగారి గుమ్మంలో ఉండాల్సిందే!

లేదూ, అసామీ పొలంపై శిస్తు పెరుగుతుంది. బాడవలు, పంటభూములయ్యేవి. మెరక పొలం మాగాణీ అయ్యేది. నీటి తీరువా పెరిగేది. పొలం జానెడైతే మూరకు శిస్తు పడేది.

అలా అప్పారావు కరణీకం వున్న రోజుల్లో మకుటం లేని మహారాజులా, మతాబులా వెలిగాడు.

కరణీకం పోవడంతో, జీవితం కుదేలైంది. ఊటబావి ఎండిపోయినట్లు ఆదాయం తగ్గి, ఖర్చు మాత్రం వెధవ ముండకు వేవిళ్ళు తప్పనట్లు పెరుగుతూనే వుంది.

ఉన్న కొడుకు చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం చూసుకోక పేకాటకు, ముండలకు దాసుడైనాడు. కూతురు కాపురానికి వెళ్ళి, ప్రతిసారీ కడుపుతో తిరిగి వచ్చేది. సంవత్సరానికి ఆరు నెల్లు చూలింత, మిగతా ఆర్నెల్లు బాలింత! ఆమె పిల్లలు తండ్రి దగ్గర కంటే తాత దగ్గరే మాలిమి ఎక్కువై, ఇక్కడే మకాం పెట్టేవారు. ఇవన్నీ చాలవన్నట్లు, అప్పారావు మళ్ళీ బారసాల పీటల మీద కూర్చునే యోగం పట్టి, కరణీకం ఊడేనాటికి మరో పిల్లకు తండ్రయినాడు.

వయస్సు అరవయ్యో పడిలో కొచ్చేసరికి, సంసారం చతికిలబడ్డది.

ఇలా ఒక్కసారి గతం జ్ఞాపకం వచ్చి, భవిష్యత్తు భయం కలిగించేసరికి అప్పారావు మరీ కృంగిపోయాడు.

అంతల్లోనే భిక్షపతి ఓ గిన్నెలో పాలు, మరో గిన్నెలో పెరుగు పట్టుకుని, హనుమంతుడు సంజీవ పర్వతం తెచ్చినట్లు వచ్చాడు. వచ్చి -

"కరణంగారూ! నింపాదిగా భోజనం కానివ్వండి. విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం ఎండ జారాక వస్తా. అట్లా పొలాల గట్ల వెంట కాసేపు తిరిగొద్దాం! అబ్బే ఊరికినే! అట్లా చెరువు గట్టు మీద కూకుని, కబుర్లు చెప్పుకుందాం!" అని గ్రుక్క త్రిప్పుకోకుండా చెప్పేసి వెళ్ళాడు.

కరణం అప్పారావు, 'ఏదో పెద్ద చేపకే ఎసరు పెట్టాడు. రానియ్యి పాతబాకీతో సహా గుంజాలి' అని నిర్ణయించుకున్నాడు.

◆ ◆ ◆

అప్పారావు, భిక్షపతిని తడిగుడ్డను పిండినట్లు, పిండేద్దామనుకున్నాడు గానీ, అది సాధ్యం కాలేదు.

భిక్షపతి కొండ మీది నుంచి క్రింద పడ్డా, వంటికి దెబ్బ తగలకుండా లేచి రాగల అసహాయశూరుడు - పులి ఎదురైతే, దానికి నామాలు పెట్టి రాగల నేర్పరి. మొసలి పట్టుకున్నా తప్పించుకురాగల శూరుడు.

కరణం అప్పారావు వెంట పొలాలన్నీ తిరిగాడు. బంజరులన్నీ చూసి వచ్చాడు. కానీ కరణం నోరు విప్పలేదు. ఆకు కందకుండా, పోక కందకుండా భిక్షపతి ప్రశ్నలకు సమాధానం చెప్పాడు.

"కరణంగోరూ ఈ పంపు ఏ సర్వే నెంబరులోదండీ" అని భిక్షపతి అడిగితే -

"ఇది.... సర్వే నెంబర్లు ఆ మధ్య మార్చారోయ్! వెధవది ఉద్యోగం లేదూ! పైగా కదిలికట్టె అంతా తీసుకున్నారుగా దొరలు! గుర్తు రావడం లేదు" అనేశాడు కరణం.

"బుల్లాయికి, మాజీ సైనికుడి కోటాలో సర్వే నెంబరు పందొమ్మిదిలో ఐదెకరాలు ప్రభుత్వం కేటాయించింది కరణంగారూ! అప్పుడు మీరే ఆ పంపు సర్వే చేసి రాళ్ళు పాతించారు గదా!"

"అబ్బో, చాలాకాలమైంది!"

"దాని పక్క పంపు దాంట్లోనే ఉండాలిగా?"

"నీవన్నది కరెక్టేనోయ్! కానీ ఆ మధ్య జిల్లా సర్వేయరు వచ్చాడుగా! వాడో తిక్క వెధవ! వాడు గ్రామ కంఠంలోని సర్వే నెంబర్లు మార్చేశాడు, వెధవ!"

ఇలా భిక్షపతి, కరణం అప్పారావు ఓ మూడు రోజులు మూగ యుద్ధం చేశారు.

భిక్షపతికి ఫలితం కనపడలా! కనపడుతుందని ఆశా మిగల్లేదు. రోజూ పాలు, పెరుగు ఇవ్వటం మాత్రం జరుగుతోంది.

ఇక ఇలా కాలయాపన చేస్తే అసలుకు మోసం వస్తుందని గ్రహించాడు. పైగా మంత్రిగారు ఏమన్నారూ?

"భిక్షపతి! సర్వే నెంబరు తీసుకురా! నా పదవి ఎంతకాలం వుంటుందో తెలియదు. నా శాఖ మారొచ్చు! కనుక త్వరగా వెళ్ళి ఓ బంజరు భూమి సర్వే నెంబరు తెస్తివా, ఆ భూమి నీకు, భూమిలేని పేద రైతు క్రింద ఇచ్చేలా చూస్తా."

భిక్షపతి ఏనుగెక్కినంత సంబరపడి, "అదెంతపని అయ్య! చిటికలో తెస్తా" అని పరిగెత్తుకు వచ్చాడు.

వస్తే, కరణీకాలు పోయాక కదిలి కట్టె స్వాధీన పరచుకున్న గుమాస్తా, "భిక్షపతీ ఈ కాగితాల్లో భూమి వుందో పాములున్నాయో, బూడిద వుందో నాకు తెలియదు! చూసినా నాకు అర్థంగావడం లేదు. నీవు చూసుకో! నీ కర్థమైతే నీ తంటాలు నీవు పడు" అని చేతులెత్తేశాడు.

హెడ్ గుమాస్తాను కలిస్తే, "అయ్యా, మూడేళ్ళబట్టీ ఈ ప్రాంతమంతా కరువు ప్రదేశమని భూమి శిస్తు మాఫీ చేశారు! అందువల్ల ఆ రికార్డు చూసే దిక్కు లేదు. సేద్యపు భూమి ఎంత? బంజరెంత? 'బి' ఫారాలెన్ని? బాడవ లెన్ని? ఎవరికీ తెలియవు. పైగా నేను గోదా వరి జిల్లావాడ్ని! ఈ మెరక పొలాల గోల తెలియదు. మహానుభావా! నీకో దణ్ణం! వెళ్ళిరా!" అన్నాడు.

భిక్షపతికి దిక్కు దోచలా! రోజులు గడుస్తున్నాయి. వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకున్నట్లు, వచ్చి మాజీ కరణాన్ని పట్టుకున్నాడు.

పట్టుకుంటే, ఫలితం ఇదీ?

ఇలా లాభం లేదనుకుని, ఓరోజు కరణం అప్పారావు ముందు -

"అయ్యా కరణంగోరూ! మంత్రి మావాడు. పొలం ఇప్పిస్తానని ఆశ పెట్టాడు. బంజరు భూమి సర్వే నెంబరు తెమ్మన్నాడు! మీరు దయతల్చాలి! మీ పేరు సెప్పుకుంటా" అని 'దాసోహం' అన్నాడు.

అప్పారావు నవ్వాడు.

"నా మాట చెప్పు!" అన్నాడు.

"నా దగ్గరేముంది కరణంగారూ! అంటరాని యదవని! సాహెబు సంపాదన బూబు కుట్టు పోగులకు సరని, యావ ఎక్కువ జావ తక్కువ నా బ్రతుక్కు! మీరైతే ముందు నెంబరివ్వండి. అర్ధరొచ్చి భూమి స్వాధీనమైతే మీ ఋణం వుంచుకోను!"

"ఇస్తా, ఇస్తానని చెప్పేమాట నమ్మనయ్యా!"

"నన్ను వేలం వేసినా కొనేవాడు లేడు! నా దగ్గరేముంది?" అన్నాడు.

కరణం అప్పారావు ఆలోచించాడు. 'బిగదీస్తే మిగిలేది పుల్లిస్తరాకు! చచ్చినోడి పెళ్ళికి వచ్చిందే చాలు!' అని అనుకొని -

"భిక్షపతీ! ఇంట్లోని పిల్లా జెల్లా చూశావుగా! పైగా వచ్చేది ఎండాకాలం. పాలు, పెరుగు లేంది పూట గడవదు. కనుక నీ దగ్గర రెండు పాడి గేదె లున్నాయన్నావుగా! ఓ దాన్ని మా ఇంటికి తోలు" అన్నాడు అప్పారావు.

భిక్షపతి గుండె గుభేలుమంది. పాడిగేదంటే, వెయ్యికి పైన మాట! పైగా తన దగ్గర పాడి గేదెలేవీ?

భిక్షపతి నవ్వాడు.

"పంతులుగారూ! మీ రడక్కుండానే పాడిగేదెను తోలుదామనుకున్నా. మీరు దాన్నేడ పోషించగలరు? మేతా, తవుడు మీరేడ తేగలరని ఊరుకున్నా. అదెంత భాగ్యం, రేపు ప్రొద్దున మీ ఇంటి ముందు గేదె, దూడ కట్టేస్తాను! సరా!" అన్నాడు.

"ఈ రాత్రికి కదిలె తీసి వెతుకుతా! ఏదన్నా సర్వే నెంబరు దొరుకుతుందేమో. రేపెలాగూ తోలుకొస్తావుగా! అప్పుడు కాగితం మీద రాసిస్తాలే!" అన్నాడు కరణం.

అన్నమాట ప్రకారం భిక్షపతి గేదెను, గడ్డి దూడను తెచ్చి ఆ రాత్రే కరణం దొడ్లో కట్టేశాడు.

కరణం సర్వే నెంబరు వేసిన కాగితం ఇచ్చాడు.

భిక్షపతి ఆఘమేఘాల మీద రాజధాని వెళ్ళాడు.

♦ ♦ ♦

భిక్షపతికి ఐదెకరాల బంజరు భూమి దాఖలు పరుస్తూ, ప్రభుత్వ ఉత్తర్వు వచ్చింది.

అయితే, ఆ ఉత్తర్వు రావటానికి కొంచెం ఆలశ్యమైంది. కరణం వ్రాసిచ్చిన సర్వే నెంబరు పదమూడా? పందొమ్మిదా అన్నది తేలలా! ఆ కాగితం చూసి కొందరు పద మూడంటే, కొందరు ఖాయంగా పందొమ్మిదని నిర్ధారణ చేశారు.

చివరకు పదమూడవ నెంబరు ఖాయం చేసి, ఆ సర్వే నెంబరులోని ఐదెకరాలు, భిక్షపతి కివ్వమని ఉత్తర్వు ఇచ్చారు.

భిక్షపతి స్వయంగా కాగితం వెంట కలెక్టరు ఆఫీసుకు, ఆ తర్వాత మండలాధికారి దగ్గరకు వెళ్ళి, మంది మార్బలంతో ఊళ్ళోకి వచ్చాడు. ఆ రోజు కోళ్ళు తెగాయి. మందు సీసాలు ఖాళీ అయ్యాయి.

ప్రొద్దున్నే అధికారులను వెంటబెట్టుకుని భిక్షపతి పదమూడవ సర్వే నెంబరు దగ్గరకు వెళ్ళాడు.

గ్రామ ప్లాను తీసి చూశారు.

అది - "మరుభూమి".

అధికార్లు ప్లానంతా వెతికారు. పదమూడో సర్వే నెంబరు భూమి శ్మశానం. అందునా సాహెబులది.

పందొమ్మిది చూశారు. అది ట్రంకు రోడ్డు.

ఎవరో జనంలోంచి సలహా యిచ్చారు - మాజీ కరణాన్ని పిలవండని!

"ఆ దొంగనాకొడుకే, నాకీ నెంబరిచ్చింది!" - భిక్షపతి అన్నాడు.

"వారి కేమన్నా ఇచ్చావా?"

భిక్షపతి మాట్లాడలేదు.

మండలాధికారి మళ్ళీ రెట్టించి అడిగాడు.

"ఏమయ్యా భిక్షపతీ! ఇంత కష్టపడి ఉత్తర్వు తెచ్చుకున్నావు. ఫలితం లేకపోయే!"

భిక్షపతికి ఏం చెయ్యాలో తోచలేదు. కానిస్టేబుల్ ఉద్యోగానికి పోయి, కటకటాల వెనుక కూర్చున్నట్లయింది.

మళ్ళీ మంత్రి దగ్గరికి పోతే మొహం వాచేలా చివాట్లు పెడతాడు. వెడదామంటే, సర్వే నెంబరేదీ?

ఆ రాత్రికి ఇద్దరు పెద్దల్ని తీసుకుని కరణం అప్పారావు ఇంటి కెళ్ళాడు భిక్షపతి!

కరణం అరుగు మీద కూర్చుని మనవరాలితోనూ, కడగొట్టు కూతురుతోను ఆడుకుంటున్నాడు.

పెద్దలు, "కరణం! నీ బుద్ధి పోనిచ్చుకున్నావుగాదు. అందుకే మీ ఉద్యోగం అటకెక్కింది. ఏదో బీదోడు పొలం సంపాయించుకుందామని నీ కాడ కొస్తే, శ్మశానం నెంబరేసి, భిక్షపతి నోట్లో మట్టిగొట్టావు! ఇలా అరాచకాలు చేస్తే, నువ్వు చచ్చిన్నాడు 'అయ్యో' అనే వాళ్ళుండరయ్యా" అని అన్నారు.

కరణం అప్పారావు నవ్వాడు.

"మీరు చెప్పడం అయ్యిందా?" అన్నాడు.

వాళ్ళు అయ్యిందంటే, "కూర్చోండి" అని, వాళ్ళు కూర్చున్నాక, "భిక్షపతి కూర్చోడులెండి, ఆవేశంలో వున్నాడు. నే చెప్పేదంతా విన్నాక ఆయనే కూర్చుంటాడు" అన్నాడు.

"ఉద్యోగం లేదు, మీకు తెలుసు గదా! ఈ వైధవ్యం రాక ముందు, నాతో పనివున్నా లేకపోయినా ఊళ్ళో వాళ్ళు మా ఇంటి అవసరాలకు అన్నీ సప్లయి చేసేవారు. నేనూ నా కుటుంబం బ్రతికాం! మరి ఇప్పుడో? నే నోరు తెర్చి, పాడి గేదె కావాలన్నా! భిక్షపతి సరేనన్నాడు. సర్వే నెంబరిచ్చా! సరికి సరి! అవ్వాలి! కాలేదు. ఎందుకని?"

కరణం అక్కడున్న వాళ్ళ మొహాలు చూశాడు.

"భిక్షపతి గేదె నివ్వలేదా?"

కరణం నవ్వాడు.

"ఇచ్చాడు."

"మరింకేం?"

"నే సర్వే నెంబరిచ్చాగా!"

"అది శ్మశానం" భిక్షపతి గావుకేక పెట్టినట్లు అరిచాడు.

"కరణం ఇది ఘోరమయ్యా!" అన్నారు పెద్దలు.

కరణం నవ్వాడు.

"ఇప్పుడేవస్తా! ఉండండి" అని లోపలకు వెళ్ళాడు.

వస్తూ, వస్తూ గడ్డి దూడను తెచ్చి పెద్దల ముందు నిలబెట్టాడు.

"భిక్షపతి, నా కిచ్చిన గేదె, దూడల్లో, గేదెను దాని యజమాని మర్రోజు ప్రొద్దున్నే వచ్చి, నన్ను నాలుగు తిట్టి, తోలుకెళ్లాడు! ఇక మిగిలింది దూడ! ఇదిగో"

పెద్దలు నోరెళ్ళబెట్టారు!

ఆశ్చర్యం తగ్గాక, పెద్దలు, "ఏంది భిక్షపతీ కరణానికి టోపీ ఏద్దామనుకున్నావా?" అని అడగాలనుకుంటే -

ఏడీ భిక్షపతి?!

•